చిక్కుముడులు వీడేనా?



ఎదిర రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

- భూభారతికి వినతుల వెల్లువ
- ముగిసిన రెవెన్యూ గ్రామ సదస్సులు
- అర్బన్ మండలంలో 453 దరఖాస్తులు
- త్వరలోనే పరిష్కరిస్తామన్న అధికారులు

మహబూబ్‌నగర్ రూరల్: భూభారతి (నూతన ఆర్వోఆర్) చట్టం అమలులో భాగంగా మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఎర్రవల్లి, బోయపల్లి, పాలకొండ, ఏనుగొండ, ఎదిర, మహబూబ్‌నగర్ రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈనెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సదస్సులు కొనసాగాయి. గతంలో ధరణిలో పరిష్కారం కాని భూ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తుల అందాయి. కలెక్టర్ విజయేందిర బోయి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సదస్సులో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

■ ఇక దరఖాస్తుల ఆధారంగా ఫిర్యాదు సమర్పించిన రైతుతోపాటు సమీపంలోని రైతులకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. ఇద్దరి వద్ద నున్న డాక్యుమెంట్‌లతోపాటు ఆధారాలను సమర్పించేందుకు ఏడురోజుల సమయం ఇస్తారు. నిర్దేశిత గడువులోగా సమర్పించిన ఆధారాలు, డాక్యుమెంట్‌లను పరిశీలిస్తారు. రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులతో పోలుస్తారు. అనంతరం సదరు దరఖాస్తు వాస్తవికతను తేల్చనున్నారు. అర్బన్ మండలంలోని ఆరు రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. వీటిలో 453 దరఖాస్తులు స్వీకరించారు. సాదాబైనామా ద్వారా క్రమబద్ధీకరించే అవకాశం మండలంలో లేదు. మిస్సింగ్ సర్వే నెంబర్లు, పెండింగ్ మ్యూటేషన్లు, కోర్టు, ఆర్డర్లు, డీఎస్ పెండింగ్, విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు ఇతర సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అందజేశారు. రెవెన్యూ గ్రామాలవారీగా వచ్చిన దరఖాస్తులను కేటగిరీలుగా విభజించి కంప్యూటర్‌లో ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. సాదాబైనామా అంశం కోర్టు పరిధిలో ఉండడంతో వాటిని మినహాయించి మిగిలిన వాటిని పరిశీలిస్తున్నారు. రెవెన్యూ గ్రామాలవారీగా నోటీసులు జారీ చేసి సమస్యల పరిష్కారానికి యత్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను ఆర్డీఓకు సిఫార్సు చేయనున్నారు.

కోర్టు చిక్కుముళ్లు వీడితే..

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం దరఖాస్తులు స్వీకరించడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలో వచ్చిన సాదాబైనామాల క్రమబద్ధీకరణకు భూభారతి చట్టంలో ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. తెల్ల కాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీకరణ జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. కోర్టు చిక్కుముళ్లు వీడితే సాదాబైనామాల దరఖాస్తుల సమస్య పరిష్కారానికి మార్గం సుగమం కానుంది.

పరిశీలించి పరిష్కరిస్తాం



రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించి, ఏ విభాగంలోకి వస్తుందో నిర్ణయించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరిస్తాం. అర్బన్ మండలంలో మొత్తం 453 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించాం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తాం. అనంతరం పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

– దేవేందర్ కేసిరెడ్డి, డీటీ, మహబూబ్‌నగర్ అర్బన్

మున్సిపల్ భవన నిర్మాణం పూర్తిచేయాలి



మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత

జడ్చర్ల టౌన్: నిర్మాణంలో ఉన్న మున్సిపల్ కార్యాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సూచించారు. శుక్రవారం వైస్ చైర్‌పర్సన్‌తో కలసి ఆమె కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యాయని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. జూలై నాటికి భవనం పూర్తికావాలని గతంలోనే చెప్పినట్లు గుర్తుచేశారు. అంతకుముందు 14వ వార్డు హనుమాన్ స్ట్రీట్‌లో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.4లక్షలతో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వార్డు కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, కృష్ణారెడ్డి, సాయి, శ్రీను, పరమటయ్య పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణముదిరాజ్



మాట్లాడుతున్న కృష్ణముదిరాజ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కాకుండానే ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేయడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేశామని చేతులు దులుపుకోవడం కాదని, రాష్ట్రంలోని అఖిలపక్ష పార్టీలను ప్రధానమంత్రితో తీసుకుపోయి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. సమావేశంలో రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు శివన్న, పటేల్ రాకేశ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలను ఏకపక్షంగా గెలవాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు సాంబయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు సాంబయ్య

నవాబ్‌పేట: రానున్న స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా గెలుచుకునేలా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, అలాగే కాంగ్రెస్ ప్రజాపాలన పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు సాంబయ్య సూచించారు. శుక్రవారం మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత చొరవతో పనిచేసి ముందుకుసాగాలన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచుల స్థానాలను గెలుచుకోవాలని సూచించారు.

మండల అధ్యక్ష ఎన్నిక పీసీసీ నిర్ణయం

కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడి ఎన్నికను పీసీసీ పర్యవేక్షణ చేసి నిర్ణయిస్తుందని ఇందులో ఎవరి ప్రమేయం ఉండదని రాష్ట్ర పరిశీలకుడు వివరించారు. మండలంలో 13 మంది కాంగ్రెస్ నాయకులు మండలాధ్యక్షుడి కోసం దరకాస్తు చేసుకున్నారని వారిపేర్లు పీసీసీ పరిశీలనలో ఉన్నాయన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు భాస్కర్, జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ చైర్మన్ జగన్, జిల్లా నాయకులు జహీర్‌అక్తర్, రవి, వాసు యాదవ్, బాబర్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నీలకంఠం ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

మిడ్జిల్: మండలంలో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులను శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించి బ్యాగులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. అలాగే మండలంలో 13 మంది ఉపాధ్యాయులు బోధించిన పాఠాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం సుధాకర్, మోహన్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, నర్సింహా, నిర్మల, సంగీత, గీతారాణి, అబ్దుల్లా, సొసైటీ సభ్యులు జగదీశ్, నవ్య, లావణ్య, శ్వేత, శ్రీనాథ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీకంచికామకోటి పీఠం పాలమూరుశాఖ 33వ వార్షికోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవ సంకల్పం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజపతాక ఆవిష్కరణ చేశారు. ఉత్సవాలు ఈనెల 29వ తేదీవరకు జరుగుతాయని శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు తోటపల్లి శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్రశర్మ తెలిపారు. వార్షిక ఉత్సవాల్లో శివాలయంలో సుప్రభాత సేవ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ, యాగశాలలో అవాహిత దేవతాపూజలు, లక్ష్మీగణపతి, గరుడ, సుబ్రహ్మణ్య, నవగ్రహ, మూలమంత్ర అనుష్టానాదులు, చండీపారాయణ, శ్రీసూక్త, పురుషసూక్త, సుందరకాండ పారాయణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వేద పాఠశాల గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న మండలి సభ్యులు

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



హెచ్‌ఎంకు కంప్యూటర్ అందజేస్తున్న దాతలు

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల ప్రాథమిక పాఠశాలకు యూనియన్ డే సందర్భంగా ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం రీజినల్ సెక్రెటరీ నరేశ్ కంప్యూటర్ వితరణ చేశారు. శుక్రవారం ఎస్‌బీఐ మాజీ జీఎం స్వర్గీయ్య తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకొని బ్యాంకు ఆధ్వర్యంలో పాఠశాలలో యూనియన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి నరేశ్ ఎంఈఓ నాగ్యానాయక్ చేతులమీదుగా పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌కు కంప్యూటర్, కలర్ ప్రింటర్, రూ.50వేల విలువైన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జనార్దన్, బ్యాంకు ఆర్‌ఎం రామూర్తి, రాములు, మదన్‌మోహన్‌రావు, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శివదర్శనంగౌడ్, రవీందర్‌గౌడ్, లక్ష్మయ్య, వెంకటయ్య, యాదయ్య, విజయ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం.. రమణీయం



కందూర్ పురవీధుల్లో రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో వెలసిన శ్రీకృష్ణమాంబ ఆలయం వద్ద 25వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాలు కొనసాగుతన్నాయి. శుక్రవారం రాత్రి ఆలయం వద్ద రథోత్సవం నిర్వహించారు. ఆలయం ముందున్న రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. రథం ముందు కుంభం పోసి యజ్ఞం చేశారు. అనంతరం రథాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అంతకుముందు ఉదయం అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంగాధర్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఘనంగా ప్రత్యేక పూజలు



దేవరకద్రలో వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం 7గంటలకు మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చారు.

ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



కళాశాల మైదానంలో సన్మాన గ్రహీతలతో సుప్రభాత్ హెల్త్‌క్లబ్, బీవీపీ సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు: భారత్ వికాస పరిషత్, సుప్రభాత్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. సుప్రభాత్ హెల్త్‌క్లబ్ కన్వీనర్ పాండురంగం యోగా ప్రాధాన్యం, ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా హెల్త్‌క్లబ్ సభ్యులు సామూహిక యోగా సనాలు చేశారు. అనంతరం లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మీనారాయణరెడ్డి, వీఎస్ఆర్‌కే ప్రసాద్, రవీందర్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ క్లబ్ సభ్యులు శంకరయ్య, సుగుణమ్మ, బాలమణి, సీమా, ప్రశాంతి, నిఖిత, యాద య్య, రామస్వామి,బీవీపీ సభ్యులు భూషణ్‌పాండే, చంద్రుడు, రాంచందర్, వెంకటేశ్వరగుప్త, సురేశ్ చందర్ దూత్, బస్వరాజు, ప్రభాకర్, ఎస్ఆర్ కిశోర్, భగవంత్‌చారి, వెంకటరాములు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ప్రేమ్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయం ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాంగోపాలచారి, శేఖర్, డాక్టర్ అనిల్ వట్టెంవార్, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, రమణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యాభివృద్ధికి కృషిచేయాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మంజుశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిరుమల హిల్స్‌లో మహతి స్కూల్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌కు ఎలాంటి వనరులు లేవని, ఇక్కడి ప్రజలకు ఉన్నది ఒక్క జ్ఞానం మాత్రమేనని, దాంతో జిల్లాను అభివృద్ధి వైపు నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఐఐఐటీ కళాశాలను ఏర్పాటు చేస్తూ అనుమతులిచ్చారన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలన్న ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలని, అకుంఠిత దీక్షతో పనిచేస్తే ఏదైనా సాధ్యపడుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతిభా కళాశాలలో చదివి నీట్‌లో జాతీయస్థాయిలో 1902 ర్యాంకు సాధించిన మంజుశ్రీని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, పాఠశాల చైర్మన్ మంజులాదేవి, డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన ఉండాలి



మల్లెబోయిన్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఐ పద్మజ

జడ్చర్ల టౌన్: అతిసార వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా చైల్డ్ హెల్త్ ఇమ్యూనైజేషన్ అధికారి పద్మజ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మల్లెబోయిన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌బీఎస్‌కే బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అతిసార నివారణ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో వ్యాధి విస్తరించే అవకాశం ఉందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలని, కలుషిత నీటిని తాగడంతో ఇబ్బందులు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు సునీల్, లీల, హెచ్‌ఎం జయప్రకాశ్, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం



సీడీపీఓకు సమ్మెనోటీసు అందజేస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: జూలై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జడ్చర్ల సీడీపీఓ శోభారాణిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తలపెట్టిన సమ్మెకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు సరోజ, సభ్యులు ప్రభావతి, రాజ్యలక్ష్మి, గౌరి, మహబూబాబేగం, విజయ, కవిత పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు సమ్మెలో పాల్గొంటున్నట్లు ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు వేణుగోపాల్, భూత్పూర్ విజయలక్ష్మి, మూసాపేట ఇందిర, చిన్నచింతకుంట కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జెడ్పీ సెంటర్(మహబూబ్‌నగర్) కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ శంకర్, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డిప్యూటీ లేబర్ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, ఐసీడీఎస్ పీడీ జరీనాబేగం, డీపీవో పార్థసారథికి సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొంటున్నట్లు సమ్మె నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

నేటినుంచి బర్హానే బాదెషా దర్గా ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలోని బాదెషా బౌలి వద్ద హజ్రత్ బర్హానే బాదెషా రెహెమతుల్లా అలై దర్గా ఉర్సు శనివారం నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దర్గా ముతవల్లి డాక్టర్ షా మహ్మద్ గయాజ్‌పాషా ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. 24వ తేదీన ఉదయం 9 గంటలకు ఫాతేహా ఖత్మే ఖురాన్‌తో దర్గా ఉర్సు వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

జడ్చర్ల టౌన్: ఇంటర్ ఫలితాల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను శుక్రవారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్ ద్వితీయ ఏడాదిలో 950కిపైగా మార్కులు సాధించిన 14మంది విద్యార్థినులను శాలువా, షీల్డుతో, ప్రిన్సిపాల్ రాధ, అధ్యాపక బృందాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, రీజియన్ డైరెక్టర్ మేడిశెట్టి రామకృష్ణ, వాసవీక్లబ్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, కండెకృష్ణ, నవీన్, దిలీప్, గణేశ్, మహేశ్, రఘు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్: బ్యాంకు సేవలు, సౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ జనరల్ మేనేజర్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్కిచర్లలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమానికి ఆర్బీఓ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ మహేశ్వర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్‌తో కలిసి బ్యాంకు సేవల గురించి వివరించారు. బ్యాంకు ఖాతాకలిగినవారు ఏడాదికి రూ.2వేలు చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.40లక్షలు, రూ.వేయి చెల్లిస్తే రూ.20లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఖాతాదారుడు బండమీది బాబు బ్యాంకులో రూ.వేయి చెల్లించడంతో ప్రమాదశాత్తు మృతిచెందగా నామినీ అయిన బండమీది ఎల్లమ్మకు రూ.20లక్షల విలువైన బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డు ఆఫీసర్ హన్మంతునాయుడు సిబ్బంది సురేశ్‌రెడ్డి, గోపిరాజు యాదయ్య పాల్గొన్నారు.

స్టేట్‌బ్యాంకు మాజీ కార్యదర్శికి నివాళి

జడ్చర్ల టౌన్: స్టేట్‌బ్యాంక్ మాజీ కార్యదర్శి దివంగత కామ్రేడ్ తారక్‌నాథ్‌కు శుక్రవారం బాదేపల్లి ఎస్‌బీఐ శాఖ ఉద్యోగులు నివాళులర్పించారు. స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా యూనియన్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అనురాగిణి ఆశ్రమంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, బియ్యం, పండ్లు, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, ఆయుష్, నెహ్రూ యువకేంద్రం, బ్రహ్మకుమారీస్, రామచంద్ర మిషన్, పిరమిడ్స్ యోగా మెడిటేషన్, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు చేపడుతున్నామన్నారు. ఉదయం 6 నుంచి 9.30 గంటల వరకు యోగా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

భాగస్వాములు కావాలి

నవాబ్‌పేట: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో అందరు పాల్గొనాలని బీజేపీ మండలాధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, గణేశ్ కోరారు.

పాలమూరు: వైద్యారోగ్య, ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో పిల్లల మర్రిలో ఉదయం 7గంటలకు యోగా డే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో కృష్ణ ప్రకటనలో తెలిపారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో చేయూత సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6:30గంటలకు యోగా డే నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు.

రంగస్థల కళాకారుడి మృతికి సంతాపం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు వరకవుల నరహరిరాజు మృతికి తెలంగాణ జాగతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పద్య కవిగా, నాటక రచయితగా, సంగీత దర్శకుడిగా ఆయన కళారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగ, ఉపా.ధ్యాయుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ జేఏసీ నాయకులతో జరిగిన సమావేశాల్లో తీర్మానం చేసిన ప్రకారంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపునకు నెలకు రూ.700 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు దానిపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయాలేదని విమర్శించారు.

రైతులకు బేడీలు వేసిన పోలీసులను శిక్షించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గద్వాల జిల్లాలో ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేసిన రైతులకు బేడీలు వేసిన పోలీసులను చట్టపరంగా శిక్షించాలని టీపీఎఫ్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి శుక్రవారం ఓప్రకనటలో డిమాండ్ చేశారు. రైతులను నేరస్తులగా చూపి యాజమాన్యం మెప్పు కోసం రైతులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని కోరారు. ఇథనాల్ కంపెనీని రద్దుచేసి రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

చదువు పేరుతో వ్యాపారం తగదు

జడ్చర్ల టౌన్: చదువు పేరుతో జడ్చర్లలో ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న వ్యాపారాన్ని సహించేదిలేదని స్వేరో జిల్లా అధ్యక్షుడు శ్రీను అభిప్రాయపడ్డారు. శుక్రవారం అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన స్వేరో జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జడ్చర్ల మండల కేంద్రంలో ఉన్న వివిధ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా సాధారణ ప్రజల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజుల జులుం తగ్గించడంతోపాటు బస్సులు ఫిట్‌నెస్ సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వేరో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి మహేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉచిత ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు హాస్టల్ వార్డెన్ తుర్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో చేరే విద్యార్థులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, స్కూల్ బ్యాగ్, పెట్టె, ప్లేటు, గ్లాస్, బెడ్డింగ్, బూట్లు, సాక్స్‌లు అందజేస్తామని తెలిపారు. పౌష్టికాహారంతోపాటు గుడ్లు, అరటి పండ్లు, స్నాక్స్, ఇడ్లీ, ఆదివారం నాన్‌వెజ్ అందిస్తామని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆధార్, కులం, ఆదాయం, బోనఫైడ్, 3ఫొటోలతో వసతి గృహాన్ని సందర్శిస్తే ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9533504466కు సంప్రదించాలని కోరారు.